
సాక్షి
అనంతపురం
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టం రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/21.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సబ్ రిజిస్ట్రార్ రమణరావుపై సస్పెన్షన్ వేటు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం టౌన్: సబ్ రిజిస్ట్రార్ రమణరావును సస్పెండ్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వైనంపై సబ్ రిజిస్ట్రార్ రమణరావుపై ఆగస్టు 29న 'సాక్షి'లో 'డబుల్ ట్రబులర్ రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు చేపట్టిన విచారణలో డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారణైంది. దీంతో రమణరావును సస్పెండ్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి ఉత్తర్వులను జారీ చేశారు. రమణరావు అనంతపురం రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన నుంచి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తూ సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు.ఏ.నారాయణపురం గ్రామంలో సర్వే నం. 156-2లోని భూమిని అక్రమంగా డబుల్ రిజిస్ట్రేషన్ చేసి వివాదానికి ఆజ్యం పోశారు. దీంతోపాటు అనంతపురం సాయినగర్‌లోని 'అస్రా' ఆప్టికల్ దుకాణం, స్థానిక 5వ రోడ్డులో ఓ సామాజిక వర్గానికి చెందిన వారికి తపోవనంలో స్థలాలు ఉండగా వాటిని సైతం వేరేవారికి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి గొడవలు రాజేశారు.

7న ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 7న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ ఎ.మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై డీఆర్‌ఓ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏపీపీఎస్సీ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. 18 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్న ఎఫ్‌బీఓ, ఏబీఓ పరీక్షకు 7,221 మంది, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న ఎఫ్ఎస్ఓ పోస్టుకు 1,314 మంది మొత్తం 8,535 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. కేంద్రానికి ఒకరు చొప్పున 18 కేంద్రాలకు 18 మంది తహసీల్దార్లను లైజనింగ్ అధికారులుగా నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ మార్గదర్శకాలు, నియమ నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయం కంటే గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరన్నారు. అడ్మిట్ కార్డుతో పాటు ఏపీపీఎస్సీ సూచించిన ఏదేని గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో ఎస్కేయూకు అత్యుత్తమ ర్యాంకు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్)లో అత్యుత్తమ ర్యాంకు దక్కింది. జాతీయ స్థాయిలో 51-100లోపు మార్క్ గల ర్యాంకును సాధించి సత్తా చాటింది. ఉన్నత విద్యా సంస్థల నాణ్యత ప్రమాణాలు మదింపు చేసి ర్యాంకులను ఎన్ఐఆర్ఎఫ్ కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ చరిత్రలోనే తొలి సారి అత్యుత్తమ ర్యాంకు దక్కడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీల్లో టాప్ ర్యాంకును ఎస్కేయూ సొంతం చేసుకుంది. ఎస్కేయూ తరువాత శ్రీ పద్మావతి వర్సిటీ నిలిచింది. బొటానికల్ గార్డెన్, మియావాకీ విధానంలో చెట్ల పెంపకం, ఇస్రో ప్రాంతీయ వాతావరణ పరిశోధన సంస్థ, నాణ్యమైన పరిశోధనలు, రాష్ట్రంలో ఏ వర్సిటీలో లేని రీతిలో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం తదితర అంశాలన్నీ ర్యాంకింగ్ మెరుగుపడడానికి దోహదపడ్డాయి.

7న కసాపురం ఆలయం మూసివేత

గుంతకల్లు రూరల్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 7న కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ విజయరాజు తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 నుంచి అర్ధరాత్రి 12.24 గంటల వరకూ సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో 7వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు తెలిపారు. తిరిగి 8వ తేదీ ఉదయం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మా స్టార్లు





అజ్ఞానమనే అంధకారాన్ని పారదోలి విజ్ఞానమనే వెలుగులు నింపుతారు. తల్లిలా ఆదరిస్తారు. తండ్రిలా బుద్ధి చెబుతారు. బెత్తంతో బెదిరించినా.. ప్రేమతో పలకరించినా శిష్యుల ఉన్నతి కోసమే చేస్తారు. అందుకే యుగాలు మారినా.. కాలాలు మారినా.. ప్రాంతాలు మారినా వారి స్థానం మాత్రం పదిలంగా ఉంటోంది. తల్లి, తండ్రి తర్వాత అంతగా కీర్తి దక్కించుకున్న గురువుల గురించి చెప్పడానికి మాటలు సరిపోవేమో..! "ఈ ప్రపంచంలో కొన్ని వందల వృత్తులు ఉన్నా వారందరినీ తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తే.. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం' అన్నారు భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. గురువు అనే స్థానానికి వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా వినూత్న బోధనతో తమకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంటున్న పలువురు టీచర్లపై ప్రత్యేక కథనం. – అనంతపురం ఎడ్యుకేషన్ /కల్చరల్

• విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్న టీచర్లు • వినూత్న పద్ధతుల్లో బోధనతో ప్రత్యేక గుర్తింపు • నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ట్రెండ్‌కు తగ్గట్లుగా..

ప్రస్తుతం ట్రెండింగ్‌గా మారిన వాట్సాప్, యూట్యూబ్‌లను వేదికగా చేసుకుని తమ పిల్లలకు వినూత్న రీతిలో బోధిస్తున్నారు కణేకల్లు మండలం హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ టీచరు మేడా ప్రసాద్. సైన్స్ కృత్య పత్రాలు, బయాలజీ బిట్ బ్యాంక్ లు, సైన్స్ ఫండమెంటల్ క్వశ్చన్ బ్యాంక్, సైన్స్ టాస్క్ బ్యాంక్, బయాలజీ ఆర్ట్ గ్యాలరీ వంటి వినూత్న రీతిలో అభ్యసన సామగ్రి తయారు చేశారు. పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు చంద్ర మునయ్యతో కలిసి ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులను 8 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు, ఒక సారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చేశారు. బయాలజీ బ్రాడ్ కాస్టింగ్ (బీబీసీ) పేరుతో ఒక వాట్సాప్ చానల్ ఏర్పాటు చేసి విద్యార్థులతో పాటు జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉండే అన్ని రకాల అంశాలను పొందుపరుస్తుంటారు. సుమారు 1,500 మందికిపైగా ఈ వాట్సాప్ చానల్‌లో సభ్యులుగా ఉండడం గమనార్హం. దీంతో పాటు 'బయాలజీ డిజిటల్ బడి' పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి విద్యార్థులు, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉండే వీడియోలు, తన విద్యార్థులతో నిర్వహిస్తున్న కృత్యాలను పొందుపరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మాధ్యమం నుంచి ఇంగ్లిష్ మాధ్యమంలోకి మారిన తరుణంలో విద్యార్థులు పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేసుకోవడానికి 'ఒడిలో సైన్స్ ఆటలు, జీవశాస్త్ర ఆటలు' అనే పేరుతో స్వయంగా సామగ్రి రూపొందించి విద్యార్థులతో కృత్యాలు చేయించారు.



బయాలజీ టీచరు మేడా ప్రసాద్

కలలు మావైనా.. సాకారం ఆయనతోనే

సాధారణంగా టీచర్లు పిల్లలకు పాఠాలు నేర్పుతారు. కానీ ఈ గురువు పాఠాలతో పాటు విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ఆయనే తాడిపత్రి పట్టణంలోని శ్రీ సుధా శ్రీరాములు మెమోరియల్ మునిసిపల్ హైస్కూల్‌లో పని చేస్తున్న హిందీ పండిట్ కె.సుకుమార్. ఈయన పని చేసిన ప్రతిచోటా చదువులో ఆసక్తి చూపే విద్యార్థులను గుర్తించి, ఆర్థిక ఇబ్బందులతో వారు వెనకడుగు వేయకూడదని భావించి ఆర్థిక అండగా నిలుస్తూ వారి చదువులకు భరోసా ఇస్తున్నారు. తన జీతంలో కొంత మేరకు డబ్బు వారికోసం ఖర్చు చేస్తూ అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. చదువు పూర్తయిన తర్వాత కూడా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు తనవంతు సహకారం అందిస్తున్నారు. ఇలా ఈయన ఇచ్చిన చేయూతతో చదువుకున్న పలువురు విద్యార్థులు నేడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సుకుమార్ చేయూతతో విద్యార్థి పి. రాజు - 2017లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎంపికై ప్రస్తుతం అనంతపురం పట్టణ ప్రణాళిక ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. పి. చెంద్రాయుడు 2022లో ఉద్యోగం సాధించి, ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. డీఎస్సీ-2025 ఎస్. ఇంజు స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్), ఎస్జీటీ రెండు పోస్టులకు ఎంపికయ్యాడు. ఎస్.కె. షరీఫ్ ఎస్జీటీ ఉద్యోగం సాధించాడు. 'మా జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది మా కుటుంబం మాత్రమే కాదు. మా గురువు సుకుమార్ సర్ కూడా. ఆయన లేకపోతే చదువు మధ్యలో వదిలేసేవాళ్లం' అని ఆ శిష్యులు చెబుతున్నారు. విజయాలు సొంత కృషితోనే అయినా, ఆ కృషికి దిశ, బలం ఇచ్చింది సుకుమార్ సార్ అని గర్వంగా చెబుతున్నారు. సుకుమార్‌తో పాటు సైన్స్ టీచర్ కె. రామకృష్ణ, తెలుగు టీచరు మల్లికార్జున తమను వెన్నుతట్టి ప్రోత్సహించారని గుర్తు చేసుకుంటున్నారు.



హిందీ టీచరు సుకుమార్‌తో పూర్వ విద్యార్థులు

తరగతి గది ఒక ప్రసూతి కేంద్రమే



ప్రతి తరగతి గది ఒక ప్రసూతి కేంద్రమే. జ్ఞానానికి జన్మనివ్వడానికి, అజ్ఞానాన్ని ఖననం చేయడానికి తరగతి గది ఒక కర్మాగారమని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలు ఉపాధ్యాయులందరికీ స్ఫూర్తి కావాలి. పాఠపుస్తకాల్లో ఉన్న సారాంశాన్ని పిండి విద్యార్థుల మెదళ్లలోకి ఎక్కించడమే కాదు.. సమాజంలో ఎదురయ్యే సమస్యలను, వాటిని పరిష్కరించుకునే మార్గాన్ని మేము తెలియజేయాలి.
– డాక్టర్ నానీల నాగేంద్ర, ఎస్కే యూనివర్సిటీ

టీచర్లకు అందరూ గౌరవం ఇవ్వాలి



మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు సమాజాన్ని ఇంకా పట్టి పీడిస్తూనే ఉన్నాయి. వీటిని తొలగించేవారే అసలు సిసలైన ఉపాధ్యాయులు. అజ్ఞానాన్ని తొలగించేలా ఆదర్శ విజ్ఞానం బోధించే గురువులతోనే చైతన్య పూరిత సమాజం నిర్మాణమవుతుంది. సమ సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులకు అందరూ తగిన గౌరవం ఇవ్వాలి.
– పూజారి ఈరన్న, పీహెచ్‌డీ స్కాలర్

ప్రైవేటు టీచర్లకూ అవార్డులు ఇవ్వాలి



దశాబ్దాలుగా విద్యార్థులనే నా పిల్లలుగా భావించి ఎక్కువ శాతం వారి వద్దనే గడపడానికి ప్రయత్నిస్తున్నా. వారు కూడా నన్ను అమ్మలాగానే చూస్తారు. సైన్స్ ఫేర్, వివిధ రకాల పోటీల్లో విద్యార్థులను చురుగ్గా పాల్గొనేలా చేస్తున్నా. ప్రభుత్వ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా నిబద్ధత, నిజాయితీతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. ప్రభుత్వాలు మమ్మల్ని గుర్తించకపోవడం అన్యాయం. ఈ తీరు మారాలి.
– మహ్మద్ షమీమ్, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు, అనంతపురం

ఆటపాటల విద్య.. ఆయన ప్రత్యేకత



చిన్న పిల్లలకు ఆటపాటలంటే ఇష్టం. వారికిష్టమైన ఆటపాటల రూపంలోనే చదివిస్తే ఇట్టే బుర్రకెక్కుతుంది. ఇదే విధానం పాటిస్తూ పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం టీచరు బిక్కి శ్రీనివాసులు. విద్యార్థుల పాఠ్యాంశాల బోధనకు దృశ్య, శ్రవణ పరికరాలను వినియోగిస్తున్నారు. దీనికితోడు పాఠాలపై ఆడియో, వీడియో సీడీలు తయారు చేశారు. తరగతి గదిలో ప్రొజెక్టర్ సాయంతో బోధిస్తున్నారు. ఈయన గణితం టీచరు అయినా మాతృభాష తెలుగు, ఆంగ్ల భాషను విద్యార్థులు సులువుగా నేర్చుకోవడానికి ప్రత్యేక బోధనా పద్ధతులు అమలు చేస్తుంటారు. మాతృభాషను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు అక్షరాల ఉపయోగాన్ని తెలియజేసేందుకు 'అక్షరానికో అభినయ గేయం' అనే సంపుటిని తయారు చేశారు. ఇందులో ఒక్కో అక్షరానికి ఒక్కో గేయం రచించారు. వాటిని రాగయుక్తంగా పాడటం, నృత్యం చేయడం, అభినయించడం ద్వారా పిల్లలకు నేర్పిస్తున్నారు. దీంతో పిల్లలు సులభంగా గుర్తు పెట్టుకుంటున్నారు.

సెలవులకు సెలవు..



పామిడి మండలం కొండాపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న బి.నాగలక్ష్మి బోధనలో వినూత్న పద్ధతులు అమలు చేస్తున్నారు. వివిధ రకాల బోధనాకృత్యాలు, బోధన సామగ్రి ఉపయోగిస్తూ నిరంతరం విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. బోధనలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. ఇటీవల ఈమె కొండాపురం పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈమె అనుసరించిన బోధనా పద్ధతులతో ప్రాథమిక స్థాయి విద్యార్థులు కూడా తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికలు సులువుగా చదువుతున్నారు. నాగలక్ష్మి తన సాధారణ సెలవులు కూడా అత్యవసరం అయితే తప్ప వినియోగించరు. 2025-26 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ప్రదానం చేయనున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఈమె దరఖాస్తు చేసుకోకపోయినా ఎంపిక చేయడం విశేషం.

నేత్రదానం ఎంతో గొప్పది

• కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: నేత్రదానం ఎంతో గొప్పదని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, జిల్లా పరిషత్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ నేత్రదానంపై అపోహలు వీడాలన్నారు. దివంగత కన్నడ నటుడు రాజ్‌కుమార్, ఆయన కుమారుడు పునీత్ రాజ్‌కుమార్ స్ఫూర్తితో ఇటీవల విజయవాడలో తన సతీమణితో కలసి నేత్రదాన ప్రతిజ్ఞ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సైదన్న తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

టీ తాగి వచ్చే లోపు నగదు అపహరణ

రాయదుర్గం టౌన్: ఓ టీ కొట్టు వద్ద నిలిపిన ద్విచక్రవాహనంలోని నగదును దుండగుడు అపహరించుకెళ్లాడు. వివరాలు.. గుమ్మఘట్ట మండలం జె.వెంకటంపల్లికి చెందిన వడ్డే కుళ్లాయప్ప గురువారం మధ్యాహ్నం ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.1.70 లక్షలు తీసుకున్నాడు. నగదును తన ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఆయన లక్ష్మీబజార్‌లోని టీ కొట్టు వద్ద ఆపి టీ తాగి వచ్చేలోపు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏడుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న 156 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం ఏడుగురు ఉన్నారు. ఏఓలు ఉమాదేవి (జెడ్పీ-అనంతపురం), జి.శ్రీనివాసులు (బత్తలపల్లి), జయరాములు(వజ్రకరూరు) ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. డిప్యూటీ ఎంపీడీఓ క్యాడర్ నుంచి శకుంతల (నల్లచెరువు), మాధవి(డీపీఆర్సీ-అనంతపురం), ఆనంద్ (రాప్తాడు), కమలాబాయ్(పెనుకొండ) ఉన్నారు.



• ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ శివశంకర్ గురువారం రాత్రి తెలిపారు. ఈ మేరకు వారందరికీ సమాచారం ఇచ్చామని వివరించారు.



సందడే సందడి: శోభాయాత్రలో కోలాహలం

పురంలో 'గణ'వీడ్కోలు

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై .. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల జయ జయ ధ్వానాలతో హిందూపురం వీధులన్నీ ప్రతిధ్వనించాయి. ఎటు చూసినా భక్తుల కోలాహలం... తప్పెట వాద్యాలు.. చెక్క భజనలు, బ్యాండు మేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతలే దర్శనమిచ్చాయి. 9 రోజులపాటు పూజలందుకుందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఏకదంతుడైన వినాయకుడి నిమజ్జనం గురువారం హిందూపురం పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలో కొలువు దీరిన 138 వినాయక విగ్రహాలను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేశారు. – హిందూపురం



బై బై గణేశా: గణపయ్య నిమజ్జనం

రైతులను కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి



అనంతపురం అగ్రికల్చర్: రైతు ఇంట ఉల్లి కన్నీరు తెప్పిస్తోంది. కోతకు వచ్చిన సమయంలో గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొంది. ధరలు నేల చూపులు చూస్తున్నందున రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలోని రాయదుర్గం ప్రాంతంలో 600 ఎకరాలు, మిగతా ప్రాంతంలో మరో 600 నుంచి 700 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల ఖర్చు చేశారు. కోతకు వచ్చిన సమయంలో ధరలు పతనం కావడంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంట కోత, నూర్పిడి, అరబెట్టేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎకరాకు గరిష్టంగా 50 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నా.. క్షేత్రస్థాయిలో క్వింటా రూ.500 పలకడం కూడా గగనంగా మారింది.

క్వింటా రూ.1,200 ప్రకారం కొనాలి.. : పెట్టుబడి కూడా చేతికిరాక అన్నదాత నష్టపోతున్నా... కూటమి సర్కారు చోద్యం చూస్తోంది. కర్నూలు, బళ్లారి మార్కెట్లకు వెళదామన్నా రానుపోనూ ఖర్చులు కూడా వెనక్కివచ్చే పరిస్థితి లేక రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు పరామర్శించడం మినహా సాయం చేయలేని పరిస్థితిల్లో ఉన్నారు. గురువారం ఉద్యాన శాఖ డీడీ డి.అనురాధ రాయదుర్గం ప్రాంతంలో పర్యటించి ఉల్లి రైతుల స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.1,200 ప్రకారం ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తే కనీసం పెట్టుబడులైనా దక్కుతాయని రైతులు పేర్కొన్నారు.

గురుకులంలో అక్రమాలపై కమిషనర్ సీరియస్

ఉరవకొండ: వజ్రకరూరు మండలం రాగులపాడు బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో ఇటీవల హాజరు నమోదులో జరిగిన అక్రమాలపై గురుకులాల రాష్ట్ర కమిషనర్ గౌతమి సీరియస్ అయ్యారు. 'హాజరు కనికట్టు.. బిల్లులు కొల్లగొట్టు' శీర్షికన ఈనెల 1న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. విచారణ చేసి 24 గంటల్లో పూర్తి స్థాయిలో నివేదిక అందచేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావును ఆదేశించారు. దీంతో పాటు గురుకులానికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఎలా నియమిస్తారంటూ ప్రశ్నించారు. గురుకులంలో పని చేసే హెడ్ కుక్ వారం రోజుల నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా వెళ్తాడని, అతని స్థానంలో ప్రవేట్ వ్యక్తిని పెట్టుకుంటే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా అందుతుందని కూడా మండిపడ్డారు.

రూ.లక్ష పలికిన వినాయకుడి లడ్డూ


లడ్డూ, కలశాన్ని దక్కించుకున్న వేలం పాటదారులు

ఉరవకొండ: స్థానిక మాస్టర్ సీవీవీ నగర్‌లో శ్రీ విద్యా వినాయక ఉత్సవ సమితి అధ్వర్యంలో కొలువుదీర్చిన గణనాథుడి లడ్డూ రికార్డు స్థాయిలో రూ.లక్ష పలికింది. గురువారం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఆదోనికి చెందిన కురుబ రాజేష్ రూ.లక్ష పాడి లడ్డూను దక్కించుకున్నాడు. స్వామి వారి వెండి గొలుసు కురుబ రంజిత్, కురుబ గోపి రూ.26,100, వెండి విగ్రహాన్ని గుండ్లపల్లి తిమ్మారెడ్డి రూ.22వేలు, కలశాన్ని కురుబ సాయినాథ్ రూ.20,116, వెండి కడియాన్ని శ్రావణ్ రూ. 16,500, వెండి ఉంగరాన్ని కిరణ్‌స్వామి రూ.5,600, శాలువను రాజేష్ రూ.4,100కు దక్కించుకున్నారు. అనంతరం వినాయక ప్రతిమలను భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

బుగ్గ రామలింగేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామిని గురువారం సాయంత్రం సూర్యకిరణాలు తాకాయి. ఏటా రెండు పర్యాయాలు స్వామి వారిని సూర్యకిరణాలు తాకుతాయని ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని అర్చకులు ప్రత్యేక పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. స్వామి వారిని తాకిన సూర్య కిరణాలను కనులారా చూసిన భక్తులు పరవశించిపోయారు.

సంకల్పానికి తలొగ్గిన ప్రకృతి

- చౌడు భూమిలో సిరుల పంటలు
- పర్మా కల్చర్‌తో ఆదర్శంగా నిలిచిన మహిళా రైతు


ఓబుళాపురంలోని చౌడు నేలలో ఏపుగా పెరిగిన పండ్ల మొక్కలు

పామిడి: సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో సెక్రటరీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పెమ్మక కదిరి నీలారెడ్డి... ప్రస్తుతం 64 ఏళ్ల వయస్సులో వ్యవసాయంలో రాణిస్తున్నారు. ప్రకృతిని అనుసరిస్తూ తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి సాధించేలా పర్మా కల్చర్ చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆమె సంకల్పానికి ప్రకృతి తలొగ్గింది. వందేళ్లకు పైగా బీడుగా ఉన్న నిస్సారమైన చౌడు నేల నేడు సారవంతంగా మారింది. ఒకటి రెండు కాదు.. మామిడి, మల్బరీ, నేరెడు, సపోటా, నిమ్మ, బత్తాయి, చీనీ, జామ, మునగ, కొంగర, సార, చిక్కుడు, టమాట తదితర 35 రకాల ఉద్యాన పంటలను సాగు చేస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు.

సొంతూరిపై మమకారం

పామిడి మండలానికి చెందిన పెమ్మక కదిరి నీలారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం తన సొంతూరిపై మమకారంతో పి.కొత్తపల్లికి చేరుకున్నారు. ఈ క్రమంలో తన పూర్వీకుల వ్యవసాయ విధానాలకు జీవంపోస్తూ పంటల సాగు చేపట్టాలని నిర్ణయించుకుని ఓబుళాపురం గ్రామంలోని 6.5 ఎకరాల పొలాన్ని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. అయితే వందేళ్లుగా ఆ భూమిలో ఒక్క పంటను కూడా పండించలేదు. చౌడు శాతం ఎక్కువగా ఉండడంతో పంటల సాగుకు యోగ్యంగా లేదని బీడుగా పదిలేశారు. అలాంటి భూమిని కొనుగోలు చేస్తున్న సమయంలో నీలారెడ్డి శ్రమ వృథా అవుతుందని అందరూ భావించారు. అయితే అందరి అంచనాలు తారుమారు చేస్తూ పర్మాకల్చర్ విధానాలతో చౌడు భూమిని సారవంతం చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ ఉద్యాన పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం ఆమె నాటిన మొక్కలు ఏపుగా పెరుగుతుండడం గమనించిన రైతులు పర్మాకల్చర్ విధానాలను అడిగి తెలుసుకుంటున్నారు.

వ్యవసాయమంటే మక్కువ


కుమార్తె ఐశ్వర్యతో నీలారెడ్డి

మనాలిలో ఓ కంపెనీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కుమారుడు అభిషేక్‌రెడ్డి, హైదరాబాద్‌లో ఆర్కిటెక్చర్‌గా పనిచేస్తున్న కుమార్తె ఐశ్వర్య సలహాలు సూచనలతో పర్మాకల్చర్ విధానాలను అనుసరిస్తూ పండ్ల మొక్కల సాగు చేపట్టాను. అత్యధికంగా 700 మామిడి మొక్కలు నాటాను. మరో నాలుగేళ్లలో మామిడి దిగుబడి చేతికి అందుతుంది.

– పెమ్మక కదిరి నీలారెడ్డి, మహిళారైతు

తాగుడు మానేయాలంటూ భర్తపై దాడి


భార్య దాడిలో గాయపడిన ఓబులేసు

ఉరవకొండ రూరల్: పదేపదే ప్రాధేయపడిన తాగుడు మానేయకపోవడంతో అసహనానికి లోనైన వివాహిత తన భర్తపై కట్టెతో దాడి చేసింది. వివరాలు.. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన ఓబులేసు, ఉలిగమ్మ దంపతులు. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో భర్త తాగుడుకు బానిసై కూలి పనులు చేయకుండా నిత్యమూ మద్యం మత్తులో జోగేవాడు. తాగుడుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ భార్యతో గొడవ పడేవాడు. తాగుడు మానాలని భార్య పలుమార్లు ప్రాధేయపడింది. అయినా ఓబులేసులో మార్పు రాలేదు. గురువారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఓబులేసును మరోసారి భార్య మందలించింది. తాగుడు మానేసి బుద్ధిగా తనతో పాటు కూలి పనులకు రావాలని హితవు పలికింది. ఆమె మాటలతో ఏకీభవించని ఓబులేసు వాగ్వాదానికి దిగాడు. దీంతో అసహనానికి గురైన ఉలిగమ్మ చేతికి అందుబాటులో ఉన్న కట్టె తీసుకుని భర్తపై దాడి చేసింది. అనంతరం స్థానికులతో కలసి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో 10 మందికి గాయాలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గురువారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. వినాయక నగర్, దళిత వాడ, కమ్మర వీధిలో తిరుగుతూ 10 మందిని గాయ పరిచింది. కూలి పనులతో జీవనం సాగిస్తున్న అంజినమ్మ, సుశీలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందజేశారు. సుశీలమ్మను అనంతపురానికి రెఫర్ చేశారు.

గుంతకల్లులో ఫీవర్ సర్వే

సాక్షి ఎఫెక్ట్..


వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

గుంతకల్లు టౌన్: పట్టణంలో విజృంభిస్తున్న విషజ్వరాలపై 'గుంతకల్లుకు జ్వర మొచ్చింది' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై జిల్లా వైద్యాధికారులు స్పందించారు. జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు గురువారం యూపీహెచ్‌సీ, గుత్తి మలేరియా సబ్‌యూనిట్ సిబ్బందితో కలసి ఎస్‌ఎస్ పేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సజీవ్‌కుమార్ సోఫియా స్ట్రీట్‌లో పర్యటించి ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరం, దగ్గు, జలుబు తదితర కారణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందించారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, దోమల నివారణ చర్యలు చేపట్టారు. ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరలక్షణాలుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యసేవలు పొందాలన్నారు. సూపర్‌వైజర్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, నారాయణస్వామి, ఏఎన్‌ఎం మంజుల, ఆశా వర్కర్ వాణి పాల్గొన్నారు. కాగా, పట్టణంలోని అన్ని వార్డుల్లో జ్వరపీడితులు అత్యధికంగా ఉంటే కేవలం సోఫియా స్ట్రీట్‌లో మాత్రమే మెడికల్ క్యాంప్, ఫీవర్ సర్వే నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది.

పాలన చేతకాకపోతే తప్పుకోండి

- కూటమి సర్కార్‌పై మాజీ మంత్రి సాకే శైలజనాథ్ ధ్వజం
- రైతు పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజనాథ్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జన జీవనం అస్తవ్యస్థంగా మారిందని, పాలన చేతకానప్పుడు తప్పుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ధ్వజమెత్తారు. గురువారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. యూరియా కొరతతో రైతులు రోజంతా బారులు తీరుతున్నా.. ఒక్క బస్తా కూడా అందించలేని అసహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే 'అంతు చూస్తాం... తప్పుడు వార్తల సృష్టి' అంటూ ఎదురు దాడి చేస్తూ కేసులు బనాయిస్తున్నారని మండి పడ్డారు. శింగనమల నియోజకవర్గంలో ఏడాది అవుతున్నా పంట సాగుకు చుక్క నీరు కూడా వదల్లేదని, పాలనలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రైతు సమస్యలపై ఈ నెల 9న అనంతపురంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట తలపెట్టిన రైతు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ భాస్కర్, 6 మండలాల కన్వీనర్లు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పూల ప్రసాద్, ఖాదర్‌వలి, యల్లారెడ్డి, శంకర్, నాగలింగా రెడ్డి, ముసలన్న, సర్పంచ్ పార్వతి, పూల నారాయణస్వామి, లలితాకళ్యాణి, లక్ష్మీరెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలుగా కవిత



శింగనమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి.కవిత.. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలుగా ఎంపికయ్యారు. చిత్తూరు, శ్రీకాకుళం, అనంతపురంలోని కేఎస్ఆర్, పామిడి, గుత్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్‌గా ఆమె పని చేశారు. ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 94 శాతం ఉత్తీర్ణతను సాధించినందుకు గాను అవార్డుకు ఎంపిక చేసినట్లుగా సమాచారం.

సంతకం ఫోర్జరీపై ఏపీపీఎస్సీ ఆరా..

- తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ కాల్
- అధికారుల్లో కలవరం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ మంజూరులో తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై ఏపీపీఎస్సీ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి గురువారం ఫోన్‌కాల్ వచ్చినట్లు తెలిసింది. ఫోర్జరీ అంశంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కొన్ని రోజుల క్రితం తాడిపత్రి పట్టణం శ్రీనివాసపురానికి చెందిన యువతి ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 2 పరీక్ష రాసింది. ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలన్న ఉద్దేశంతో అనర్హురాలైనా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సృష్టించింది. సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా కాకుండా మ్యానువల్‌గా ఇవ్వడానికి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి సమర్పించింది. దీనిపై అనుమానం వచ్చిన ఏపీపీఎస్సీ కార్యాలయం అధికారులు సదరు సర్టిఫికెట్‌ను వెరిఫికేషన్ కోసం తాడిపత్రికి పంపడంతో గుట్టు రట్టు అయింది. ప్రాథమికంగా ఫోర్జరీ సంతకంతో సర్టిఫికెట్ పొందారని ఏపీపీఎస్సీ అధికారులు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలోనే తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర రిపోర్టు పంపడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో స్థానికుల్లో అధికారుల్లో కలకలం రేగింది. మ్యానువల్‌గా సర్టిఫికెట్ మంజూరు చేయడానికి సంతకాలు పెట్టిన అధికారితో పాటు కిందిస్థాయి సిబ్బంది సంతకాలు కూడా ఉండే అవకాశం ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. తహసీల్దార్ సోమశేఖర్ పంపనున్న నివేదికను బట్టి ఈ వ్యవహారంలో భాగస్వాములైన వారి ఉద్యోగాలు ఆధారపడ్డాయన్న ప్రచారం జరుగుతోంది.

జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు అవార్డులు


ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి


డాక్టర్ ఎస్.శారద


డాక్టర్ ఓంప్రకాష్

అనంతపురం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ టీచర్ల అవార్డులకు జేఎన్‌టీయూ (ఏ)లో పనిచేస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. ఎంపికైన కంప్యూటర్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి. ఈశ్వరరెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓం ప్రకాష్‌ను వర్సిటీ ఉద్యోగులు అభినందించారు. శుక్రవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులను వీరు అందుకోనున్నారు. కాగా, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి తాజాగా నిరాశ ఎదురైంది. ఈ దఫా ఏ ఒక్క ప్రొఫెసర్ సైతం బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపిక కాలేదు. ఎస్కేయూలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంజినేయులు, ప్రొఫెసర్ రమణ పేర్లు ప్రతిపాదించినా.. ప్రభుత్వం నిర్దేశించిన స్కోరు లేకపోవడంతో తిరస్కరణకు గురయ్యారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలు..


సుధాకరరెడ్డి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (39) ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున అనంతపురం నుంచి ఆటోలో రాయదుర్గం వైపు బయలుదేరిన వన్నూరు స్వామి కళ్యాణదుర్గం మండలం గోళ్ల సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వన్నూరు స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పుట్లూరు: మండలంలోని సి.వెంగన్నపల్లి గ్రామానికి చెందిన అంబటి సుధాకరరెడ్డి (38)కి భార్య హైమావతి, ఓ కుమార్తె ఉన్నారు. సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో గురువారం విధులకు వెళ్లేందుకు సిద్ధమైన సుధాకరరెడ్డి ద్విచక్ర వాహనంపై తాడిపత్రి వైపుగా వెళుతుండగా పుట్లూరు మండలం శనగలగూడురు వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుధాకరరెడ్డిని వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఘటనపై పుట్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏమార్చి ఏటీఎం నుంచి నగదు డ్రా


గార్లదిన్నె: బ్యాంక్ ఖాతాదారుడిని ఏమార్చి అతని ఏటీఎం ద్వారా నగదు డ్రా చేసుకున్న ఘటన గార్లదిన్నెలో కలకలం రేపింది. వివరాలు.. గార్లదిన్నె మండలం కొట్టాలపల్లికి చెందిన పురుషోత్తం గురువారం బుక్కరాయసముద్రం మండలం వడియంపేటలోని ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లాడు. అయితే నగదు రాకపోవడంతో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి సాయాన్ని కోరాడు. ఆ సమయంలో పురుషోత్తం వద్ద ఏటీఎం కార్డు తీసుకుని యంత్రంలో ఉంచిన అనంతరం పిన్ నంబర్ నమోదు చేస్తుండగా గుర్తించాడు. నగదు డ్రా కాకపోవడంతో మాటల్లో మభ్యపెడుతూ ఏటీఎం కార్డు మరోకటి చేతికి ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నాడు. దీంతో పురుషోత్తం గార్లదిన్నెకు చేరుకోగానే తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.22 వేలు నగదు డ్రా అయినట్లుగా మొబైల్‌కు మెసేజ్ అందింది. దీంతో వెంటనే గార్లదిన్నె యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా ఖాతాను పరిశీలించారు. ఒకే రోజు మూడు సార్లు ఏటీఎం ద్వారా రూ.22 వేలు నగదు డ్రా చేసినట్లు తెలిపారు. దీంతో తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును పరిశీలించుకుంటే అది తనది కాకపోవడంతో మోసపోయినట్లుగా నిర్ధారించుకుని బ్యాంక్ ఖాతాను బ్లాక్ చేయించాడు.

బాలుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులకు రిమాండ్

బుక్కరాయసముద్రం: మైనర్ బాలుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. బీకేఎస్ మండలం కొట్టాలపల్లిలో ఓ బాలుడు 2022, ఏప్రిల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. పాత కేసులు త్వరగా పూర్తి చేయాలన్న ఎస్పీ ఆదేశాల మేరకు.. బాలుడు ఆత్మహత్య కేసులో లోతైన విచారణ అనంతరం నలుగురు యువకులను అరెస్ట్ చేసి గురువారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

జిల్లాస్థాయిలో 76 మంది ఉత్తమ గురువులు

- నేడు అవార్డుల అందజేత
- ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో వేడుకలు



అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న 76 మందిని ఈ విద్యా సంవత్సరం జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగే 'గురు పూజోత్సవ వేడుక'ల్లో వీరికి అవార్డులు అందజేయనున్నారు. ఎంపిక జాబితాను గురువారం సాయంత్రం విద్యాశాఖ విడుదల చేసింది. అవార్డులు అందుకునే వారిలో అనంతపురంలోని జీహెచ్‌ఎస్ నం.-2 పనిచేస్తున్న ఎస్.నవీద, కె.శ్రీనివాసులురెడ్డి, 15 వార్డులోని పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌నాయక్, ఎస్ఎస్‌బీఎన్‌లో పనిచేస్తున్న ఎం.నాగరాజు, నందమూరి నగర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు జి.నారాయణస్వామి, కేఎస్ఆర్ స్కూల్ టీచర్ ఎం.శ్రీదేవి, పాపంపేటలో పని చేస్తున్న టీఎం వెంకటేశులు, బి.గీతాలక్ష్మి, కె.పండరీనాథ్ (74 ఉడేగోళం), ఈ.వేణుగోపాల్ (కొనకొండ్ల), కె.సోమశేఖర్ (రామసాగరం), ఎస్.ఆదిశంకర్ (నేత్రాపల్లి), ఎ.వెంకటేశులు (పాలవాయి), సీకే సుబ్రహ్మణ్యం (గోనబావి), ఎస్.సుధ (అబ్బేదొడ్డి), ఎం.డానియల్ (రాయలచెరువు), సర్వమంగల (పాల్తూరు), జి.శ్రీనివాసులు (కళ్యాణదుర్గం), వాణిశ్రీ చూడామణి (ఉప్పరహాళ్), ఎం.సాయిలీల (బొమ్మనహాళ్), సుశీల (చౌళూరు), ఎం.సిద్ధేశ్వరస్వామి (కంబదూరు), కె.రవీంద్ర (హనకనహాళ్), కె.శ్రీధర (గంగలాపురం), బి.సూరిబాబు (యలగలవంక), జి.రఘురాం (యలగలవంక), ఎస్.కృష్ణమోహన్‌రెడ్డి (పి.వెంగన్నపల్లి), ఎ.వెంకటజయశంకర్ (కొట్టాలపల్లి), జె.వెంకోబరావు (పూలకుర్తి), జేకే శివశరణప్ప (ఆవులదట్ల), పి.నందకుమార్ (ముట్టాల), ఎస్.రవీంద్ర (పెద్ద యక్కలూరు), టి.రజనీకుమారి (చిన్నహోతూరు), జి.విజయమేరీ (చిత్రచేడు), ఆర్.తులసీనాయక్ (రామసాగరం), ఎస్ఆర్ రాజమణి (వెస్ట్ నరసాపురం), పి.సునీత (బి.యాలేరు), కేఆర్ సునీత (హొసగుడ్డం), వీణ కాళిదాసరాజు (గోనెహాళ్), ఈ.మాధవి ఎడ్వర్డ్స్ (పాతకొత్త చెరువు), కె.సరిత (హనకనహాళ్), జె.సూర్యనారాయణ (బెస్తరపల్లి), డి.అగస్టీన్ కుమార్ (తాడిపత్రి), ఎం.కళాసుధాకర్‌రావు (కొనకొండ్ల), కె.హెప్సి సరోజ (గుత్తి), యూ.కోటప్ప (అంకంపల్లి), ఎం.జయరాముడు(ఆకులేడు), బి.సరహేసుజన్ (పూలకుంట), కె.కృష్ణమూర్తి (చెన్నంపల్లి), ఎ.పవన్‌కుమార్ (ఉద్దేహాళ్), ఎం.హరినాథ్ (హవళిగి), పి.లక్ష్మన్న (రాప్తాడు), పి.శివప్రసాద్‌నాయుడు (ఊబిచెర్ల), పి.వేణుగోపాల్ (గోనబావి), జి.చిత్తయ్య (కళ్యాణదుర్గం), ఎ.ప్రభావతి (పాతకొత్తచెరువు), ఎం.చంద్రశేఖర్ (రాకెట్ల), ఆర్సీ అక్కులప్ప (కూడేరు), ఎ.శ్రీరాములు (గోపులాపురం), పి.వజీర్‌బాషా (కోనంపల్లి), ఎస్.సరళ (రామరాజుపల్లి), వి.మారెన్న (ఎస్.గుండ్లపల్లి), బి.నాగలక్ష్మి (కొండాపురం), యూ.శ్రీనివాసులు (యలగలవంక), వైకేఎల్ రంగమ్మ (నెలగొండ), పి.సరస్వతి (దుద్దేకుంట), ఎస్.వినీత (మానిరేవు), పి.రాధ (గొల్లలదొడ్డి), కె.శ్రీదేవి (దుద్దేకుంట), ఎస్.ఆశా (గార్లదిన్నె), ఎ.అర్జున్ (హనిమిరెడ్డిపల్లి), కె.వన్నప్ప (జె.కొట్టాల), ఎం.వెంకటాచలపతి (చింతకాయమంద), ఎస్.మహేష్‌కుమార్ (కేకే తండా), ఎల్.రాజేశ్వరి (అనంతసాగర్‌కాలనీ), సీహెచ్ బాలగోవిందు (వెంకటాపురం) ఉన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ వర్కర్లకు సన్మానం



అంగన్‌వాడీ వర్కర్లను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: టీచర్స్ డే పురస్కరించుకుని గురువారం అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు జమున, పార్వతిలను ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ అనురాధ సన్మానించారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నగరంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

రేపు అనంత పద్మనాభ వ్రతం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కెనాల్ సమీపంలో కొలువుదీరిన కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ వ్రతం నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు మహా గణపతిపూజ, స్వామివారి వ్రతం శాస్త్రోక్తంగా సాగుతాయని, 10.30 గంటలకు ఇస్కాన్ ప్రతినిధి పరమకరుణ గౌరీ హరిదాస్ ప్రభు ప్రవచనం ఉంటుందని వెల్లడించారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ



విద్యార్థి జితేష్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రపంచ చదరంగ సమాఖ్య (ఎఫ్‌ఐడీఈ), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) సంయుక్తంగా ఇటీవల విడుదల చేసిన చదరంగం జాబితాలో స్థానిక రామ్‌నగర్ సేతు స్కూల్ 6వ తరగతి విద్యార్థి మంచికంటి జితేష్ ఇంటర్నేషనల్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ 1,449ను సాధించాడని యాజమాన్యం పేర్కొంది. జితేష్ తండ్రి నందకిశోర్ చదరంగం శిక్షకుడు. తాడిపత్రికి సీనియర్ చెస్ కోచ్ సురేంద్రనాథ్ చెస్ మెంటార్ శిక్షణలో జితేష్ మరిన్ని మెళకువలు నేర్చుకున్నాడని యాజమాన్యం తెలిపింది. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.

మార్కెట్‌యార్డు ఇన్‌చార్జ్ సెక్రటరీగా ఏడీఎం



రాఘవేంద్రకుమార్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ (ఇన్‌చార్జి)గా రాఘవేంద్రకుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఎం)గా పనిచేస్తున్నారు. ఇక్కడున్న సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్‌యార్డుకు డెప్యుటేషన్‌పై వెళ్తున్నారు. దీంతో ఏడీఎంకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ గురువారం కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాఘవేంద్రకుమార్ ఈనెల 6న బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

చట్టాలపై అవగాహన అవసరం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ

ఆత్మకూరు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ తెలియజేశారు. గురువారం సనప గ్రామంలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహాలు, వాటి వలన కలిగే అనార్థాలు, విద్య, పోషణ, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌లను వివరించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల చాలా అనార్థాలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ సుధారాణి, సూపర్‌వైజర్ శ్రీవాణి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా సాయిగ్రేస్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా సాయిగ్రేస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె బాధ్యతలు తీసుకున్నారు. కడపలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్‌లో ఫారెన్ సర్వీసు కింద పని చేస్తున్న ఆమె.. తిరిగి అనంతపురం వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియాను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

పట్టు జారితే ప్రమాదమే!



‘రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి’ అంటూ అధికారులు మొత్తుకుంటున్నా కొందరికి తలకెక్కడం లేదు. ఇష్టారాజ్యంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రం. అప్పటికే కిక్కిరిసిన జీపులో పైకి ఎక్కడమే కాకుండా ముందు బ్యానెట్‌పై కూడా కూర్చుని ప్రయాణించడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గురువారం అనంతపురం– ఆలమూరు మార్గంలో ఈ దృశ్యం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మిలాద్-ఉన్-నబీకి సర్వం సిద్ధం

- నేడు పలు చోట్ల ప్రవక్త కేశ దర్శనం
- శాంతి ర్యాలీలకు ప్రత్యేక ఏర్పాట్లు





ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మేయర్ వసీం, విద్యుద్దీప కాంతుల నడుమ నూతన శోభ సంతరించుకున్న బహువుద్దీన్ మసీదు

అనంతపురం కల్చరల్: మహమ్మద్ ప్రవక్త (స) జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరగనున్నాయి. వాడవాడలా శాంతి ర్యాలీలతో ప్రవక్తకు భక్తినీరాజనాలర్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మసీదులను విద్యుద్దీపకాంతులతో సుందరంగా అలంకరించారు. ఏళ్లుగా సాగుతున్న జులుస్ (శాంతి ర్యాలీ) ఉదయం 9.30 గంటలకు నగరంలోని అన్ని మసీదుల నుంచి ప్రారంభమై 11 గంటల ప్రాంతంలో సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదు వద్ద కలిసి టవర్‌క్లాక్ వరకు శాంతి ర్యాలీ చేస్తూ ఆర్ట్స్‌కాలేజ్ వద్ద సామూహిక దువా చేస్తారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. మధ్యాహ్నం లోపు నమాజుకు చేరుకుంటారని బహువుద్దీన్ ముతవల్లి ఫరీదుద్దీన్ తెలిపారు. అదేవిధంగా మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నగరంలో పాతూరులోని ఆసార్ వీధి, రెండోరోడ్డులోని బహువుద్దీన్ మసీదు, మాసుమాబీదర్గా తదితర చోట్ల పవిత్ర ప్రవక్త కేశ దర్శనం ఏర్పాటు చేస్తున్నారని భక్తులు దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించాలని మసీదుల పెద్దలు తెలిపారు.

గంధం ఊరేగింపులో మేయర్..

మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా సాగాలని ఆకాంక్షిస్తూ ముందు రోజు సాగే గంధం మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. పాతూరు జిలాన్ కుటుంబం నుంచి 200 ఏళ్లుగా సాగుతున్న ఉరుసు గంధం మహోత్సవానికి మేయర్ వసీం, రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ, ఆధ్యాత్మికవేత్త సయ్యద్ షా కుస్తార్ రబ్బానీ సాహెబ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై శాంతి ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. పర్వదినం సందర్భంగా శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జులుస్ సాగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మదాని ఇషాక్, అడ్వొకేట్ ఇసాక్, కార్యనిర్వాహకులు జిలాన్ జావిద్, అక్రమ్ ఆఫ్రిద్, రియాజు గౌస్ పీరా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అనంతలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా శుక్రవారం నుంచి రాష్ట్రస్థాయి నాటక పోటీలు ప్రారంభం కానున్నాయి. భగవాన్ శ్రీ సత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 9 వరకు జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరం వేదికగా సాగుతాయి. తొలిరోజు కర్నూలు వారి ‘జగదేక సుందరి’ పద్యనాటకం, 6న ఉదయం తెలంగాణకు చెందిన జోగులాంబ జిల్లా వారి ‘సత్యా కృష్ణుల పరిణయ ఘట్టం’ మధ్యాహ్నం లక్ష్మంపల్లిగ్రామానికి చెందిన ‘బాలనాగమ్మ’ నాటకం, సాయంత్రం పల్నాడు జిల్లా పెనుగొండ వారి శ్రీశివభక్త కుంటి మల్లారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం, హైదరాబాదుకు చెందిన ‘స్వామి అయ్యప్ప’ పూర్తి నాటకం 7న ఉదయం కల్యాణదుర్గం వారి ‘మాయల మరాఠి’, సాయంత్రం అనంతపురం వారి ‘కార్యవర్ధి’ సీను, డీఆర్‌ఓ మలోల ప్రత్యేకంగా నటించే ‘పడక సీను’ కేపీహెచ్‌బీ కాలనీ వారి ‘భక్తప్రహ్లాద’ పౌరాణిక పద్య నాటకం, 8న ఉదయం అనకాపల్లికి చెందిన కళాకారుల ‘గయోపాఖ్యానం’ పౌరాణిక పద్య నాటకం, తెలంగాణ సూర్యాపేట్ జిల్లా వారి ‘భక్త చింతామణి’ కామక్కపల్లి వారి ‘శ్రీకృష్ణ తులాభారం’ సాయంత్రం కణేకల్లు మండలం వారి ‘సత్యహరిశ్చంద్ర’ కాటి సీను, గుంటూరు జిల్లా వారి ‘పల్నాడు యుద్ధం’ నాటకాలు జరుగుతాయి. చివరిరోజు అనంతనాగ్ సంగీత్ ప్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారి సంగీత విభావరితో నాటక పోటీలు ముగుస్తాయి. అనంతరం ఆదేరోజు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని దక్షిణ భారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యులు మైకేల్ బాబు తెలిపారు.

వైఎస్ జగన్‌తోనే ముస్లింలకు న్యాయం



మసీదు కమిటీ మెంబర్లకు చెక్కు అందజేస్తున్న సాదిక్‌వలి

అనంతపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్‌వలి అన్నారు. మిలాద్– ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని రుద్రంపేట పంచాయతీలోని ఏ రహమత్ మసీదు కమిటీ మెంబర్లకు గురువారం వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్‌వలి రూ.12 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అందడంతో పాటు రాజకీయంగా అనేక పదవులు అందాయన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మసీదుకు విరాళం అందించామన్నారు. మిలాద్-ఉన్-నబీని ముస్లిం సోదరులందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రుద్రంపేట ఎంపీటీసీ-4 సభ్యురాలు మహబూబీ, మసీదు కమిటీ సభ్యులు, ఎంఎస్ఎస్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం తపోవనంలోని శివశక్తి సాయి దేవాలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భాద్రపద శుక్లపక్షంలో వచ్చే ద్వాదశి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు పర్యవేక్షణలో వేదపండితులు కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించి, ప్రసాద వితరణ చేశారు. అభిషేకం, విశ్వక్సేన ఆరాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, దేవేంద్ర పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను గురువారం ఇన్‌చార్జ్ వీసీ బి. అనిత ప్రకటించారు. ఫలితాలు శుక్రవారం నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రతి సబ్జెక్ట్ పేపర్‌కు రూ.500గా ఫీజు నిర్దేశించినట్లు ఆమె వెల్లడించారు.

జీఎంసీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అనంతపురం మెడికల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో 2కె22 బ్యాచ్‌కు చెందిన మెడికోల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, తదితర అధ్యాపక బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తెలుగు మధుసూదన్, ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం అగ్రికల్చర్/గుత్తి: యూరియా అంశంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ సంయుక్త తనిఖీలు గురువారమూ కొనసాగాయి. ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.నాగభూషణం, ఎస్‌ఐ నరేంద్రభూపతి, వ్యవసాయ అధికారి జె.వాసుప్రకాష్, గుత్తి ఏడీఏ ఎం.వెంకటరాముడు, ఏఓ ముస్తాక్, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఏడు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మూడు దుకాణాల్లో భౌతిక నిలువలు, ఈ-పాస్ మిషన్ నిల్వల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. చట్టప్రకారం రూ.15 లక్షల విలువ చేసే 15.90 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశారు. యూరియాకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించినా, నో స్టాక్ బోర్డులు పెట్టడం లాంటివి చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ గడువు పొడిగింపు

అనంతపురం సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎస్‌ఎన్‌ఎల్ కేవలం ఒక్క రూపాయికే అమలులోకి తెచ్చిన ఫ్రీడమ్ ప్లాన్ గడువును మరో 15 రోజుల పాటు పొడిగించినట్లు ఆ శాఖ జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

శివకోటిలో చంద్రగ్రహణ పూజలు

అనంతపురం కల్చరల్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా నగరంలోని శివకోటిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.57 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము 1.26 నిమిషాల వరకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 8వ తేదీ చంద్ర రాహువులకు శాంతి పూజలు, పాశుపత రుద్రాభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు.

ఆంధ్రా ప్రెసిడెంట్, మధ్యప్రదేశ్ జట్ల విజయం



మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 టోర్నీలో భాగంగా గురువారం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచుల్లో ఆంధ్రా ప్రెసిడెంట్, మధ్యప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. తొలుత ఆంధ్రా ప్రెసిడెంట్, ఆంధ్రా సెక్రెటరీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది.49.1 ఓవర్లలో 232 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా సెక్రెటరీ జట్టు కేవలం 30.4 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బరోడా బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. 45.4 ఓవర్ల వద్ద 178 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 45.4 ఓవర్లలో 182 పరుగుల సాధించి విజయాన్ని కైవసం చేసుకుంది.

రేపు నిరసన కార్యక్రమాలు

అనంతపురం అర్బన్: భారతీయ ఉత్పత్తుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి అమెరికా పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 6వ తేదీన జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, నిరసనలు తలపెట్టినట్లు వామపక్ష పార్టీల నాయకులు వెల్లడించారు. ఈ మేరకు సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ (ఎన్డీ), సీపీఐఎంఎల్, ఎస్‌యూసీఐ పార్టీల జిల్లా కార్యదర్శులు నల్లప్ప, నారాయణస్వామి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర సంయుక్తంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా సుంకం 50 శాతానికి పెంచడంతో ఆ ప్రభావం ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, తదితర ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని ట్రంప్ సర్కార్ దెబ్బతీస్తున్నా మోదీ సర్కార్ నోరుమెదపడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఈనెల 6న జిల్లావ్యాప్తంగా వామపక్ష పార్టీలు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా కేంద్రంలో ఎరువుల అమ్మకాల పర్యవేక్షణ

- ఒక్కో ఫర్టిలైజర్ షాపునకు ఒక ఆర్ఎస్‌కే నియామకం

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలో ఎరువుల అమ్మకాలపై నిఘా ఉంచేందుకు రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్లను నియమిస్తూ ఆశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గురువారం అనంతపురం రూరల్ ఏఓ వెంకటకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు నగరంలో ఎరువుల అమ్మకాలను పర్యవేక్షించనున్నారు. తాటిచేర్ల వీహెచ్‌ఏ గంపరాజుకు శ్రీనివాస ఫర్టిలైజర్, ఆలమూరు వీహెచ్ఓ విజయభాస్కర్‌కు న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్, మన్నీల వీహెచ్ఏ జయచంద్రారెడ్డికు శ్రీ కృష్ణ ట్రేడర్స్, కందుకూరు వీహెచ్ఓ మల్లికార్జునకు శ్రీ రంగస్వామి ఫర్టిలైజర్స్, కొడిమి వీహెచ్ఏ ప్రమోద్‌కు శ్రీ లక్ష్మీ రంగ అగ్రి సొల్యూషన్స్, చియ్యేడు వీహెచ్ఏ భరత్‌కుమార్‌కు శ్రీలక్ష్మి ట్రేడింగ్ కార్పొరేషన్‌లో అమ్మకాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. యూరియాతో పాటు ఇతర ఎరువులు పారదర్శకంగా విక్రయించేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

వ్యాయామం చేయకపోవడంతోనే పీసీఓడీ



మాట్లాడుతున్న డాక్టర్ సుప్రజ చౌదరి

అనంతపురం ఎడ్యుకేషన్: వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పులు, జంక్ ఫుడ్ తినడంతోనే ‘పీసీఓడీ’ వస్తుందని, ఫలితంగా అమ్మతనం పొందడం కష్టమవుతుందని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుప్రజ చౌదరి పేర్కొన్నారు. గురువారం ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో పీసీఓడీపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుప్రజ చౌదరి మాట్లాడుతూ అండాశయం నుంచి అండం విడుదల కాకుండా ఉండిపోవడంతో నెలసరి రాదన్నారు. అండం చుట్టూ నీరు చేరి బుడగలు వస్తాయన్నారు. ఇది అండాశయాలు వాపు కావడానికి కూడా దారి తీస్తాయన్నారు. దీన్నే పీసీఓడీగా చెబుతామన్నారు. ఇది జీవన శైలిలో మార్పులతోనే వస్తుందని, నెలసరి అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. యోగా అండ్ వెల్నెస్ కోచ్ డాక్టర్ గుర్రప్ప మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయాలన్నారు. తీపి పదార్థాలు తినకూడదని, ప్రోటీన్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ యం.నాజ్మా బేగం, నాగలక్ష్మి, లక్ష్మీరంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. గురువారం రైతులతో కలసి తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులకు ఉచితంగా అందించాలని, యూరియా కావాలని రైతులు రాష్ట్రంలో బారులు తీరుతున్నా ప్రభుత్వం నిద్రమత్తు వీడలేదన్నారు. రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఈశ్వరయ్య, బ్రహ్మయ్య, వెంకటేష్, తిరుపాల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఆత్మకూరులో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

ఆత్మకూరు: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ శివశంకర్ ఆదేశించారు. గురువారం ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. మంజూరైన నిధులు, వాటి వినియోగంపై ఆరా తీశారు. ప్రగతి నివేదికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డిప్యూటీ ఎంపీడీఓ కామక్క, ఏఓ నాగకృష్ణయ్య, మండల పరిషత్ సిబ్బంది శ్రీనివాసులు, ప్రభాకర్, రంగనాథ్ పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వీడండి

రాప్తాడు: చెత్త సేకరణలో నిర్లక్ష్యం వీడాలని పంచాయతీ అధికారులను జెడ్పీ సీఈఓ శివశంకర్ ఆదేశించారు. గురువారం ఆయన రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏ రోజు చెత్త ఆ రోజే సేకరించాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి పంచాయతీలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గురువును మించిన దైవం లేదు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లలో గురువారం ముందస్తు గురుపూజోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. రేపటి పౌరులను సమర్థులుగా తయారు చేసే శక్తి గురువులకే ఉందన్నారు. గురువుకు మించిన దైవం లేదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



మినర్వా స్కూల్ గురుపూజోత్సవంలో పాల్గొన్న కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు



నవభారత్ స్కూల్‌లో గురువులకు సన్మానం